


వింత ఆలోచనలు

తెలిసీతెలియని వయస్సులో సామాజిక మాధ్యమాల మోజులో పడి నేటి యువతీయువకులు పక్కదారి పడుతున్నారు. - 8లో



ముగిసిన మహోత్సవాలు

నాగార్జున సాగర్ తీరంలో మూడు రోజులుగా కొనసాగుతున్న సాగర్‌మాత మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. - 8లో



న్యూస్‌రీల్

11, 12 తేదీల్లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ పర్యటన

నల్లగొండ : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఈనెల 11, 12 తేదీల్లో నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధ్యక్షతన సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబునాయక్, కొంకతి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసులు, భూములకు సంబంధించిన కేసులపై సమీక్షిస్తారని పేర్కొన్నారు. 11వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కమిషన్ సూర్యాపేట నుంచి నల్లగొండకు చేరుకొని సాయంత్రం 5.30 వరకు కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. నల్లగొండ నుంచి బయలుదేరి 6.30కు నాగార్జునసాగర్ వెళ్లి అక్కడే రాత్రి బస చేసి 12న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సాగర్‌లో ఇరిగేషన్, ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 1 గంటకు కొండమల్లేపల్లి మండలం పిలియాతండాకు వెళ్లి వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ వెళ్తారని తెలిపారు.

స్వేరోస్ సభను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్వేరోస్ సభ్యులు

నల్లగొండ : ఖమ్మంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న స్వేరోస్ సభను విజయవంతం చేయాలని స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ పాండు కోరారు. సభ పోస్టర్‌ను ఆదివారం నల్లగొండలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 15 నుంచి ఏప్రిల్ 14 వరకు భీమ్ దీక్ష పవిత్ర మాసంగా జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కుక్కముడి శ్రీను, రత్నకుమారి, యాదమ్మ, ఎల్లేష్, నాగుల జ్యోతి, వినోద్, చొక్కమ్మ, మర్రి నాగయ్య, మేడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎయిమ్స్ వార్షికోత్సవం

బీబీనగర్ : మండల కేంద్రంలోని ఎయిమ్స్ వైద్య కళాశాల 5వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 7 గంటలకు వేడుకలకు ప్రారంభం కానున్నాయని, ముఖ్య అతిథిగా పద్మ విభూషణ్, ఏఐజీ ఆస్పత్రి ఫౌండర్, చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు.

అడవులు, ఖనిజ సంపదను కాపాడాలి



మాట్లాడుతున్న నారాయణరావు

భానుపురి(సూర్యాపేట): అడవులు, ఖనిజ సంపదను కాపాడాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్ నారాయణరావు అన్నారు. వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సూర్యాపేటలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఏళ్లుగా కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు ఆదివాసుల హక్కులను కాలరాస్తూ పాలిస్తున్నాయన్నారు. అడవుల్లోని ఖనిజ సంపదను దేశీయ, విదేశీయ కార్పొరేట్లకు దోచిపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ సదస్సులో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్‌కుమార్, న్యాయవాది తల్లమల్ల హసేన్, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ జిల్లా కన్వీనర్స్ భద్రయ్య పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయ సమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమం నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని వీరహనుమాన్, శ్రీరామకోటి స్తూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ముగ్గురు మనోళ్లే..!

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో ఉమ్మడి జిల్లాకు అగ్రస్థానం

కాంగ్రెస్ నుంచి ఇద్దరు.. సీపీఐ నుంచి ఒక్కరు ఖరారు



అద్దంకి దయాకర్



కేతావత్ శంకర్‌నాయక్



నెల్లికంటి సత్యం

- అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్‌నాయక్ పేర్లను ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం
- సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం
- గతంలో మిస్ అయినా.. ఎట్టకేలకు పదవి దక్కించుకున్న అద్దంకి
- పార్టీనే నమ్ముకున్న శంకర్‌నాయక్‌ను వరించిన ఎమ్మెల్సీ
- విధేయుడినే ఎంపిక చేసిన కమ్యూనిస్టు పార్టీ
- సామాన్యులకే దక్కిన అవకాశం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అగ్రస్థానం దక్కింది. రాష్ట్రంలో మొత్తం ఐదు స్థానాల ఖాళీ అవుతుండగా.. అందులో మూడు స్థానాలకు నల్లగొండ జిల్లా నుంచే అభ్యర్థులు ఖరారయ్యారు. వీటిలో కాంగ్రెస్‌పార్టీ ఇద్దరికి, సీపీఐ ఒక్కరికి అవకాశం కల్పించింది. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ పేర్లను అధిష్టానం ప్రకటించింది. ఇక.. పొత్తులో భాగంగా సీపీఐకి ఒక్క సీటు కేటాయించగా.. ఆ పార్టీ తమ అభ్యర్థిగా నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పేరును ఖరారు చేసింది. దీంతో ఎమ్మెల్సీ స్థానాల్లో జిల్లాకు పెద్దపీట వేసినట్లయ్యింది. వీరంతా సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ ఉండటంతో వీరి గెలుపు లాంఛనమే కానుంది. ఆయా పార్టీలకు విధేయులుగా.. పార్టీ కోసం కష్టపడ్డ సామాన్యులకే అవకాశం దక్కిందని ఆయా పార్టీ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఉద్యమ నేత దయాకర్

తుంగతుర్తి నియోజక వర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించింది. దయాకర్.. జాతీయ మాలమహానాడు వ్యవస్థాపకుడు. తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీలో (టీజేఏసీ) అధికార ప్రతినిధిగా పనిచేశారు. 2014లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో దయాకర్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఆ తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అనుచరుడిగా ఉంటూనే, కాంగ్రెస్ పార్టీలో అధికార ప్రతినిధిగా పనిచేశారు. ప్రస్తుతం టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్టీ కష్టకాలంలో దయాకర్.. రేవంత్‌రెడ్డి ప్రధాన అనుచరుడిగా ఆయన వెంటే ఉన్నారు. పార్టీ కోసమే పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించారు. అయితే ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలు కొందరు దయాకర్‌కు టికెట్ విషయంలో సానుకూలత వ్యక్తం చేయకపోవడంతో ఆయనకు టికెట్ దక్కలేదు. చివరకు మందుల సామెల్‌కు టికెట్ ఇచ్చారు. ఆ సమయంలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామని చెప్పడంతో దయాకర్ మిన్నకుండిపోయారు. ఆ తరువాత గతేడాది జనవరిలోనూ ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని దయాకర్ కోరారు. అధిష్టానం కూడా బల్మూరి వెంకట్‌తోపాటు ఆయన పేరును ఖరారు చేసింది. నామినేషన్ కోసం పత్రాలు సిద్ధం చేసుకోమని చెప్పి, ఆ తర్వాత మళ్లీ వద్దంటూ ఫోన్ చేసి షాకిచ్చింది. దయాకర్ స్థానంలో మహేష్‌కుమార్‌గౌడ్ పేరును ప్రకటించింది. దీంతో ఆయనకు ఎమ్మెల్సీ అవకాశం అప్పుడు తప్పిపోయినా.. ఇప్పుడు అవకాశం లభించింది. ఇటీవల ఆయన మాజీ మంత్రి జానారెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఆయనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇవ్వాలని వారు కూడా లేఖలు ఇచ్చారు.

విద్యార్థి దశ నుంచే పోరుబాట

సీపీఐ నుంచి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన నెల్లకంటి సత్యం చిన్ననాటి నుంచి వామపక్ష భావజాలానికి ఆకర్షితుడై విద్యార్థి దశ నుంచే పోరాట బాట పట్టారు. ఆనాటి భూస్వామ్య, పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా పోరాడారు. 1985 నుంచి 2000 వరకు ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా.. జిల్లా కార్యదర్శిగా పని చేశారు. 2010 నుంచి 2016 వరకు సీపీఐ మునుగోడు మండల కార్యదర్శిగా ఉన్నారు. 2016 నుంచి సీపీఐ నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి, 2020 నుంచి సీపీఐ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. బొమ్మగాని ధర్మభిక్షం అడుగు జాడల్లో పని చేస్తూ సీపీఐ బలోపేతానికి కృషి చేస్తూనే పార్టీలో అంచలంచెలుగా ఎదిగారు.

పార్టీని నమ్ముకున్న శంకర్‌నాయక్..

కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా మిర్యాలగూడ నియోజకవర్గానికి చెందిన కేతావత్ శంకర్‌నాయక్ సేవలను అధిష్టానం గుర్తించింది. ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించింది. శంకర్‌నాయక్ విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీతోనే ఉండి, కార్యకర్తగా, నాయకుడిగా ఎదిగారు. మొదట్లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న శంకర్‌నాయక్ ఆ తరువాత కాంగ్రెస్ పార్టీ నేతగా, 1998 నుంచి 2001వరకు కాంగ్రెస్ పార్టీ దామరచర్ల మండల అధ్యక్షుడిగా పనిచేశారు. 2001, 2014లో రెండుసార్లు జెడ్పీటీసీ సభ్యుడిగా, 2006 నుంచి 2011 వరకు ఎంపీపీగా పనిచేశారు. 2011 నుంచి 2014 వరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఆ తర్వాత మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన ఆయన 2019 నుంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అయితే మధ్యలో ఒకసారి బీఆర్‌ఎస్‌లో చేరారు. యాక్టివ్‌గా లేకపోయినా కొన్నాళ్లు బీఆర్‌ఎస్‌లో ఉండి తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా.. లేకున్నా పార్టీ కోసం పని చేశారు. పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉన్నారు. మొదటి నుంచి మాజీ మంత్రి జానారెడ్డి శిష్యుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన్నే నమ్ముకొని ఆయన సూచనలతో పార్టీలో ముందుకు సాగుతున్నారు. మాజీ మంత్రి జానారెడ్డితో పాటు జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆశీస్సులు శంకర్‌నాయక్‌కు ఉన్నాయి.



నృసింహుడి రథోత్సవం.. కనుల వైభవం

- ఆలయ తిరు, మాడ వీధుల్లో విహరించిన కల్యాణమూర్తులు
- ఉదయం శ్రీమహావిష్ణువు అలంకారంలో నృసింహుడి దర్శనం

యాదగిరిగుట్ట: యాదగిరీశుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దివ్య విమాన రథోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా సాగింది. శనివారం రాత్రి లక్ష్మీదేవిని పరిణయమాడిన నృసింహుడు.. మరుసటి రోజు ఉదయం ప్రధానాలయంలో నిత్యారాధనల అనంతరం శ్రీమహావిష్ణువుగా రూపు దాల్చి గరుడవాహనంపై మాడ వీధుల్లో విహరించారు. అనంతరం తూర్పు రాజగోపురం ఎదుట సేవను వేంచేపు చేసి వేదమంత్రాలు, పారాయణాలు పఠిస్తూ ప్రధానార్చకులు అలంకార విశిష్టతను వివరించారు. ఈ వేడుకలో కలెక్టర్ హనుమంతరావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, అర్చకులు, పారాయణికులు, రుత్వికులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గరుడవాహనంపై శ్రీమహా విష్ణువు అలంకార సేవను ఊరేగిస్తున్న అర్చకులు

నేటి కార్యక్రమాలు

సోమవారం ఉదయం మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, రాత్రి శ్రీపుష్ప యాగం, దేవతోద్వాసన, దోపు ఉత్సవం నిర్వహించనున్నారు.

దివ్య విమాన రథోత్సవం

సాయంత్రం ప్రధానాలయంలో నిత్యారాధనలు పూర్తయిన అనంతరం చతుస్థానార్చనలు, మండపారాధనలు, మూలమంత్ర జపములు, ద్వారాతోరణ పూజలు, దివ్య ప్రబంధ పారాయణాలు, మహామంత్ర పుష్పం, పురాణ, ఇతిహాస, విజ్ఞాపన వేడుకలు చేపట్టారు. అనంతరం రథాంగ హోమం, రథబలి, శ్రీస్వామివారి ఉత్సవమూర్తుల అలంకార సేవను ఊరేగించారు. రాత్రి దివ్య విమాన రథంపై ఆశీనులైన కల్యాణమూర్తులు.. ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తజనులను అనుగ్రహించారు. భాజాభజంత్రీలు, భక్తుల జయజయ ధ్వానాలు, నృత్యాలు చేస్తుండగా రథోత్సవం ముందుకు సాగింది. తిరు, మాడ వీధులు నృసింహుడి నామస్మరణతో మార్మోగాయి. నృత్యాలతో సందడి చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



శ్రీమహావిష్ణువు అలంకార సేవ ముందు కూచిపూడి నాట్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

భానుపురి (సూర్యాపేట): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కోఆర్డినేటర్ అనంతుల మధు డిమాండ్ చేశారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో పలువురు తెలంగాణ ఉద్యమకారులు స్థానిక పోస్టాఫీస్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డ్‌లు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవం, స్వరాష్ట్ర ఆకాంక్ష కోసం ఉద్యమించిన తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం 250గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన కోరారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ ఉద్యమ నాయకులు గట్ల రామశంకర్, బాషిపంగు సునీల్, పడిదల ప్రసాద్, పంతం యాకయ్య, మామిడిశెట్టి అంజయ్య, ధరావత్ నాగేశ్వరావు, బారి ఖాన్, నారబోయిన్ కిరణ్, కొలికపంగు వాసు, పోరీళ్ల విష్ణుకుమార్, ఓ బాబా, దుబ్బ రమేష్, బొడ్డు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టు కార్డులను పంపిస్తున్న ఉద్యమకారులు

సమీకృత గురుకులాల నిర్మాణానికి నిధులు

- ఒక్కో గురుకులానికి రూ.200 కోట్లు మంజూరు..
- ఉమ్మడి జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో నిర్మాణం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో ఆరు నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ జీఓ 56 జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, కోదాడ, మునుగోడు, నాగార్జునసాగర్, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో వీటిని నిర్మించనుంది. ఒక్కోదాన్ని రూ.200 కోట్లతో నిర్మించేందుకు పాలన పరమైన అనుమతులు జారీ చేసింది.

సాహిత్య సృజనలో మేటి.. తూర్పు మల్లారెడ్డి

భువనగిరి : తెలుగు సాహిత్య సృజనలో తనదైన ప్రతిభను చాటుతూ భావితరాలకు మార్గదర్శిగా నిలిచిన గొప్పకవి తూర్పు మల్లారెడ్డి అని రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ కొనియాడారు. తూర్పు మల్లారెడ్డి రచించిన శ్రీ యాదగిరి నరసింహ శతకాన్ని ఆదివారం భువనగిరిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాష సాహిత్యంలో విద్యార్థులను గొప్పగా తీర్చిదిద్దిన ఘనత మల్లారెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం పద్య కవిత పఠనం నిర్వహించారు. అంతక ముందు పలువురు కవులను సన్మానించారు. కళాశాల కార్యదర్శి వంశ తిలక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, శతావధాని మలుగ అంజయ్య, పద్యకవులు దోరవేటి చెన్నయ్య, డాక్టర్ నలవోడు నరిసింహారెడ్డి ఉన్నారు.

ప్రైవేట్ టీచర్లకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

హుజూర్‌నగర్: అర్హులైన ప్రైవేట్ టీచర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగరాజు కోరారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణంలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో సభ్యులకు ఐడీకార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ టీచర్స్ సమస్యలను పరిష్కరించడంతోపాటు అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు నాగమణి, నాగరాజు, రాంబాబు, ప్రకాష్, శ్రీనివాసచారి, కృష్ణకుమారి, విజయ్‌కుమార్, కవిత, నాగేంద్రబాబు, సునీత, వీరబాబు, కోటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

పంటను కాపాడేందుకు పాట్లు



భూగర్భ జలాలు అడుగంటడంతో రైతన్నలు సాగుచేసిన పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. చేతికొచ్చే దశలో ఉన్న పంటను కాపాడుకునేందుకు కర్షకులు పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు బోర్ల ద్వారా రోజుకు ఒకటి, రెండు మడులు తడుపుతుండగా.. మరికొంత మంది రైతులు ట్యాంకర్ల ద్వారా నీటి తెచ్చి పొలాన్ని తడుపుతున్నారు. దీంతో ట్యాంకర్ల కిరాయి రైతులకు భారంగా మారుతోంది. - మునుగోడు

ఆహారం కల్తీకి చెక్!

- ఉమ్మడి జిల్లాకు ఫుడ్ మొబైల్ ల్యాబ్ వాహనం
- వెంటనే నాణ్యత పరీక్ష చేసేలా చర్యలు
- కల్తీలేని ఆహార పదార్థాలు అందించడమే లక్ష్యం

నల్లగొండ టూటౌన్ : దేశంలో సాంకేతిక విప్లవం ఎంత వేగంగా పెరిగిపోతుందో అంతే వేగంగా అన్నింటా కల్తీ కూడా పెరుగుతోంది. ఏ ఆహార పదార్థం అయిన కల్తీ లేనివి దొరకడం గగనమైంది. ఆహార పదార్థాల్లో కల్తీని నిరోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. అందులో భాగంగా కల్తీ ఆహార పదార్థాలను ఇట్టే కనిపెట్టేందుకు రూ.60 లక్షల విలువ చేసే ఫుడ్ మొబైల్ ల్యాబ్ వాహనాన్ని ఉమ్మడి జిల్లాకు మంజూరు చేసింది. దీని ద్వారా కల్తీని వెంటనే నిర్ధారించే అవకాశం ఉంటుంది. ఈ వాహనంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఇక నుంచి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి నాణ్యతను పరీక్షించిన అనంతరం నివేదికను కలెక్టర్‌కు పంపనున్నారు. కల్తీ లేని ఆహార పదార్థాలను ప్రజలకు అందించడమే ధ్యేయంగా ఫుడ్ మొబైల్ ల్యాబ్ వాహనాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

వాహనం ప్రత్యేకతలు..

- ఫుడ్ మొబైల్ ల్యాబ్ వాహనంలోని ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన పరికరాల ద్వారా ఆహార పదార్థాలను పరీక్షించడంతో వెంటనే వాటి నాణ్యత తెలిసిపోతుంది.
- పెద్ద, పెద్ద హోటళ్లతోపాటు ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగే జాతరలు, పండుగలు, ఉర్సుల్లో ఆహార పదార్థాలను వెంటనే పరీక్షించే వెసులుబాటు ఉంటుంది.
- ఆహార పదార్థాల్లో ఫుడ్ పాయిజన్ అయినా, ఇతర ఏ విధమైన కల్తీ జరిగినా అక్కడ ఉన్న అన్ని ఆహార పదార్థాలను వినియోగించకుండా తక్షణ చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.
- హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, స్వీట్ హౌజ్‌లు, బేకరీలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, తోపుడు బండ్ల మీద పెట్టి వ్యాపారం చేసే వారి వద్ద కూడా తనిఖీలు చేసి నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవచ్చు.
- పాలు, పెరుగు, కూరల్లో వినియోగించే మసాల దినుసులు, కూరగాయలు, అయిల్ తదితర వాటిని పరీక్షించి అక్కడే ఫలితాన్ని చూపిస్తారు.



ఫుడ్ మొబైల్ ల్యాబ్ వాహనం

కల్తీలేని ఆహారం అందించాలి



ఉమ్మడి జిల్లాలోని ప్రజలకు కల్తీలేని ఆహార పదార్థాలు అందించేందుకు ఫుడ్ మొబైల్ ల్యాబ్ వాహనం ఎంతో ఉపయోగపడనుంది. వ్యాపారులు నాణ్యమైన, కల్తీలేని ఆహార పదార్థాలను ప్రజలకు అందించాలి.

– జ్యోతిర్మయి, ఫుడ్ సేఫ్టీ అసిస్టెంట్ కంట్రోలర్

గురుకులాలు, హాస్టళ్లలోనూ తనిఖీలు..

ఇటీవల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురుకులాలు, హాస్టళ్ల, మధ్యాహ్న భోజనం ఫుడ్ పాయిజన్ అయి పలువురు విద్యార్థులు అనారోగ్యం బారిన విషయం తెలిసిందే. ఇక నుంచి ఇలాంటి వాటికి చెక్ పడనుంది. గురుకులాలు, కాలేజీలు, మోడల్స్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని ఈ ఫుడ్ మొబైల్ ల్యాబ్ వాహనంతో వెళ్లి సంబంధిత అధికారులు నాణ్యతపై పరీక్షలు జరిపే అవకాశం ఉంటుంది. ఈ వాహనాన్ని ప్రారంభించిన రోజే నల్లగొండ పట్టణంలోని పద్మనగర్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి కల్తీపై ఆరా తీశారు.

క్లుప్తంగా

తొలితరం కవి రావిరాల బుచ్చయ్య మృతి


రావిరాల బుచ్చయ్య

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన తొలితరం కవి, రచయిత రావిరాల బుచ్చయ్య (75) అనారోగ్యంతో శనివారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆయన ఆర్టీసీ సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. గతంలో విరసం ఆవిర్భావ సభ్యుడిగా, ఆ సంఘం నల్లగొండ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన 1964లో 'సింధు రామవ్వ' నవలను, 1977లో 'విముక్తి పథం' అనే గ్రంథంతో పాటు అనేక కవితలు, కథలు, పలు రచనలు రాశారు. అంతేకాకుండా ఆయన టీవీ ఆర్టిస్టుగా, నాటకకర్తగా ఉన్నారు. ఆయన మృతి పట్ల సృజన సాహితి అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ సాగర్ల సత్తయ్య, తెలంగాణ సాహితీ జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, కవులు, రచయితలు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, దర్శనం అంజయ్య, మేరెడ్డి యాదగిరిరెడ్డి, వట్టిమర్తి గ్రామ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నర్రా లవేందర్‌రెడ్డి, బూరుగు రమేష్ సంతాపం తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య


బుగ్గ ప్రవీణ్ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సీతావానిగూడెం గ్రామానికి చెందిన బుగ్గ ప్రవీణ్ (25) ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం మృతుడి తల్లిదండ్రులు తమ బంధువుల ఇంట్లో జరిగే ఓ కార్యానికి వెళ్లారు. ప్రవీణ్ ఉదయం పొలంవద్దకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న ప్రవీణ్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన అతడి అన్న ప్రభాకర్ ఇంట్లోకి వెళ్లి చూడగా ప్రవీణ్ ఉరివేసుకుని కనిపించాడు. కాగా.. ప్రవీణ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. చేతికంది వచ్చిన కుమారుడు బలవన్మరణానికి పాల్పడటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

యాదగిరి క్షేత్రంతో గరిమెళ్లకు అనుబంధం

యాదగిరిగుట్ట: టీటీడీ ఆస్థాన సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ తిరుపతిలోని ఆయన నివాసంలో ఆదివారం మృతి చెందారు. యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఇటీవల పాల్గొని అన్నమయ్య సంకీర్తనలను తన బృందంతో ఆలపించారు. గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ ఇటీవల యాదగిరి క్షేత్రాన్ని సందర్శించారని పలువురు అధికారులు, సిబ్బంది ఆయనను గుర్తు చేసుకున్నారు.

అంతుచిక్కని వ్యాధితో గేదె మృతి

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని మామిళ్లగూడెం గ్రామంలో అంతుచిక్కని వ్యాధితో గేదెలు మృత్యువాత పడుతున్నాయి. ఆదివారం పర్సమోని అనసూయకు చెందిన గేదె తలను నేలకు బాదుకుని మృతి చెందింది. అంతేకాక పర్సమోని కమలమ్మ, బొడ్డు ఎల్లమ్మకు చెందిన గేదేలు సైతం వ్యాధిసోకి వింతగా ప్రవర్తిస్తున్నాయని బాధితులు తెలిపారు. గేదెలు తలను నేలకు గట్టిగా గుద్దుకొంటూ వింతగా ప్రవర్తిస్తున్నాయని పేర్కొన్నారు. వారం రోజులుగా గడ్డిమేయడంలేదని, పగలు, రాత్రివేళల్లో నిద్రపోవడంలేదని చెబుతున్నారు. పశువైద్యాధికారులను సంప్రదించగా.. వారు మందులు ఇచ్చినా తగ్గడం లేదని వాపోయారు. ఇలా అంతుచిక్కని వ్యాధితో గేదెలు మృతి చెందుతుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు.

'మేళ్లచెరువుకు చెందిన అమ్మాయి ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతూ ఇంటి వద్ద కుట్టు పని చేసుకుంటుంది. ఈ బాలికకు కోదాడలో ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి బాలుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యాడు. బాలుడిని కలవడానికి సదరు బాలిక ఇంటి వద్ద చెప్పకుండా కోదాడకు వచ్చింది. సదరు బాలుడితో పాటు అతని స్నేహితులతో కలిసి వెళ్లిపోయింది. బంధువుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు వారం రోజులు అష్టకష్టాలు పడి బాలిక ఆచూకీ కనుక్కొని బంధువులకు అప్పగించారు.'

'మునగాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న ఇద్దరు బాలికలకు ఓ వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యాడు. అతని మాయమాటలకు ఇద్దరు బాలికలు ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయారు. ఉపాధ్యాయులు తోటి విద్యార్థుల వద్ద సమాచారం సేకరించి పోలీసులకు ఇవ్వడంతో సదరు నిందితుడిని పట్టుకుని బాలికలను రక్షించారు.'

'కర్నూల్ జిల్లా నందికొట్కూర్‌కు చెందిన బాలికకు కోదాడ మండలం కాపుగల్లుకు చెందిన యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. రెండు రోజుల క్రితం సదరు బాలిక ఇంట్లో చెప్పకుండా కోదాడకు వచ్చి సదరు యువకుడిని పెళ్లి చేసుకొని రక్షణ కల్పించాలని కోదాడ రూరల్ పోలీసులను ఆశ్రయించింది.'

వికసించని మనసుల్లో.. వింత ఆలోచనలు

సామాజిక మాధ్యమాల మోజులో పక్కదారి పడుతున్న టీనేజర్లు

- చిన్న పరిచయాలతో అతి కొద్దిరోజుల్లోనే ప్రేమకు దారితీస్తున్న వైనం
- ముక్కుమొహం తెలియని వ్యక్తులతో ఇళ్లు వదిలి వెళ్తున్న అమ్మాయిలు
- తల్లిదండ్రులు నిత్యం గమనించాలంటున్న పోలీసులు



కోదాడ: తెలిసీతెలియని వయస్సులో సామాజిక మాధ్యమాల మోజులో పడి యువత పక్కదారి పడుతోంది. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో ఏర్పడుతున్న పరిచయాలు కొద్దిరోజుల్లోనే ప్రేమలు, పెళ్లిళ్లకు దారితీస్తుండగా, మరికొన్ని చోట్ల బాలికలు మోసపోతున్నారు. ముక్కుమొహం తెలియని వ్యక్తులతో ఏర్పడిన వారం పది రోజుల పరిచయాలతోనే కన్నవారిని, ఉన్న ఊరిని వదిలి వందల కిలోమీటర్లు వెళ్తున్నారు.

ఇష్టానికి వదిలేస్తున్నారా...

ఇంట్లో పిల్లలు సెల్‌ఫోన్ వాడుతున్నారని తెలిసినా తల్లితండ్రులు పట్టించుకోకుండా వారి ఇష్టానికి వదిలేస్తుండడంతో అపరిచితులతో పరిచయాలు పెంచుకుంటున్నారని పలువురు అంటున్నారు. సామాజిక మాధ్యమాలలో పిల్లలు ఏమి చేస్తున్నారో తల్లిదండ్రులు నిత్యం గమనించాలని నిపుణులు అంటున్నారు. అన్ని విషయాలను పిల్లల ఇష్టానికి వదిలేస్తుండడంతో పాటు ఎదుటి వ్యక్తి చెప్పే మాయమాటలకు టీనేజ్ పిల్లలు వెంటనే ఆకర్షితులై మోసపోతున్నారని పేర్కొంటున్నారు. కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలు సామాజిక మాధ్యమాల్లో పెంచుకుంటున్న పరిచయాలు ఎలాంటివి..? వారు ఎవరితో మాట్లాడుతున్నారు..? ఎవరితో చాటింగ్ చేస్తున్నారో కనీసం గమనించడం లేదని, టీనేజ్ పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యమే అనర్థాలకు దారి తీస్తోందని నిపుణులు చెబుతున్నారు.

టీనేజ్ బాలికలే ఎక్కువ..

సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో పరిచయాలు పెంచుకుంటున్న వారిలో ఎక్కువ మంది టీనేజ్ బాలికలు, మైనార్టీ తీరనివారే ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తుందని పలువురు విద్యావేత్తలు అంటున్నారు. ఫేక్ ఐడీలతో మార్ఫింగ్ ఫొటోలతో కొంతమంది టీనేజ్ బాలికలతో పరిచయాలు పెంచుకొని మాయమాటలతో వారిని మోసం చేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. మునగాల బాలికలను మోసం చేసిన వ్యక్తి 40 సంవత్సరాలకు పైబడి వయస్సున్నప్పటికి ప్రొఫైల్‌లో 20 సంవత్సరాల ఫొటో పెట్టి బాలికలను మోసం చేశాడు.

తల్లిదండ్రులు బాధ్యత మరవొద్దు

సామాజిక మాధ్యమాలకు పిల్లలను దూరంగా ఉంచేలా తల్లిదండ్రులు చూడాలి. స్మార్ట్‌ఫోన్ వాడుతున్న వారి విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. వారు ఏం చేస్తున్నారో, ఎవ్వరితో పరిచయాలు పెంచుకుంటున్నారో నిత్యం గమనించాలి. దారి తప్పుతున్నారని గమనిస్తే తగిన విధంగా కౌన్సిలింగ్ ఇప్పించాలి. సామాజిక మాధ్యమాలతో వచ్చే మంచి చెడులను వారికి వివరించాలి. ప్రతి రోజు పిల్లలకు కొంత సమయం కేటాయించి వారితో మాట్లాడాలి.

– మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, కోదాడ డీఎస్పీ

హైవేపై మూడు కార్లు ఢీ


పెద్దకాపర్తి శివారులో హైవే రోడ్డుపై ఢీకొన్న కార్లు

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ పరిధిలో హైవేపై ఆదివారం వరుసగా వెళ్తున్న మూడు కార్లు అకస్మాత్తుగా ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వాహనాలు వెళ్తుండగా.. పెద్దకాపర్తి గ్రామ శివారులోని కోళ్ల ఫారాల వద్దకు రాగానే ముందు వెళ్తున్న ఓ వాహన డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో ఆ వెనకే ఉన్న మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో ఆ కార్లలో ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఒక మహిళ కాలు విరగగా, మరొకరి తలకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో హైవేపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేశారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ బీసన్న, పక్కన పెద్దవూర ఎస్‌ఐ వీరబాబు

నాగార్జునసాగర్: గత కొన్నాళ్లుగా ఎయిర్‌టెల్, బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్ టవర్లలోని ఆఆర్‌యూ(రేడియో రిమోట్ యూనిట్), బీబీయూ(బేస్ బాండ్ యూనిట్)ల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను నాగార్జునసాగర్ సర్కిల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం విజయపురి సౌత్‌జోన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ బీసన్న వివరాలు వెల్లడించారు. తిరుమలగిరి(సాగర్) మండలం జానారెడ్డి కాలనీకి చెందిన జటావత్ మహేష్, జటావత్ నాగేష్, జటావత్ వినోద్‌లు కొంత కాలం నుంచి పెద్దవూర, తిరుమలగిరి(సాగర్),హాలియా మండలాలతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లోని నరసరావుపేట పరిధిలో గల పలు ఎయిర్‌టెల్, బీఎస్‌ఎన్‌ఎల్ టవర్లలో 5జీ ఇంటర్‌నెట్ సిగ్నల్ కోసం బిగించే ఆఆర్‌యూ (రేడియో రిమోట్ యూనిట్), బీబీయూ (బేస్ బాండ్ యూనిట్)లను దొంగిలించి వాటిని హైదరాబాద్‌లోని నాంపల్లికి చెందిన మాలిక్ అనే వ్యక్తికి విక్రయించేవారు. ఈ దొంగల ముఠాకు గతంలో సెల్‌పోన్ టవర్లలో పనిచేసిన అనుభవం ఉండటంతో సులభంగా డబ్బులు సంపాదించవచ్చనే ఉద్దేశ్యంతో ఈ దొంగతనాలకు పాల్పడుతుండేవారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు పర్యవేక్షణలో, సీఐ బీసన్న ఆధ్వర్యంలో పెద్దవూర ఎస్‌ఐ వీరబాబు తన సిబ్బందితో కలిసి పెద్దవూర మండలంలోని పోతునూరు గ్రామ శివారులోని టోల్‌గేట్ వద్ద నిందితులను పట్టుకొని అరెస్ట్ చేశారు. నిందితులను విచారించగా మొత్తం ఐదు కేసుల్లో నేరం అంగీకరించినట్లు సీఐ తెలిపారు. దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురితో పాటు, యూనిట్లను కొనుగోలు చేసి వారికి సహకరించిన మాలిక్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితుల నుంచి ఒక ఆర్‌ఆర్‌యూ యూనిట్, రూ. లక్షా యాభై వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసును త్వరితగతిన చేధించిన ఎస్‌ఐ వీరబాబు, సిబ్బందిని సీఐ బీసన్న అభినందించారు.

జనశక్తి సీనియర్ నేత కన్నుమూత


సోమయ్య(ఫైల్)

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలో నివాసం ఉంటున్న సీనియర్ జనశక్తి రాష్ట్ర నాయకుడు చీటూరి సోమయ్య(85) అనారోగ్యంతో శనివారం రాత్రి కన్నుమూశారు. ఆయన స్వగ్రామం జనగాం జిల్లా దేవరుప్పల మండలం ధర్మాపురం. సీపీఐఎంఎల్ జనశక్తి పార్టీలో సోమయ్య క్రియాశీలకంగా పనిచేశారు. ఆయన మృతదేహానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, అరుణోదయ రాష్ట్ర సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, తెలంగాణ ఉద్యమకారుడు డాక్టర్ చెరుకు సుధాకర్, టీపీసీసీ నేత ధైద రవీందర్, బీసీపీ జిల్లా కార్యదర్శి గాజుల సుకన్య, ట్రస్మా రాష్ట్ర నేత కందాల పాపిరెడ్డి, జనశక్తి నేత కోమరయ్య, న్యూడెమోక్రసీ నేతలు ఇందురు సాగర్, అంబటి చిరంజీవి తదితరులున్నారు.


అంత్యక్రియలు నిర్వహిస్తున్న సోమయ్య కుమార్తె నిర్మల

పుస్తెలతాడు అపహరణ

చందంపేట: మండలంలోని చిత్రియాల గ్రామానికి చెందిన చిన్న జయమ్మ శుక్రవారం వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లగా.. ఇంట్లో ఉంచిన మూడు తులాల బంగారు పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. ఈ మేరకు ఆమె శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. నెల రోజుల క్రితం ఇదే గ్రామంలో గుండె యాదయ్యకు చెందిన మూడు తులాల బంగారు పుస్తెల తాడు అపహరించుకెళ్లారు. చోరీ నేపథ్యంలో గ్రామస్తులు ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు.

ముగిసిన సాగర్‌మాత మహోత్సవాలు


మాట్లాడుతున్న గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య

నాగార్జునసాగర్ : గత మూడు రోజులుగా జరుగుతున్న సాగర్‌మాత మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ముగింపు సమిష్టి దివ్యబలిపూజా కార్యక్రమానికి విచ్చేసిన గుంటూరు పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్యకు భక్తులు ఘన స్వాగతం పలికారు. ముందుగా స్థానిక అంబేడ్కర్ సెంటర్‌కు చేరుకున్న పీఠాధిపతులకు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి గుడి వద్దకు తీసుకువచ్చారు. ఉదయం 5గంటలకు అత్తలూరు విచారణ గురువులు గురుశ్రీ చాట్ల కస్పార్‌చే దివ్యబలిపూజ, 6గంటలకు కారంపూడి విచారణ గురువులు పెట్ల గురుశ్రీ మర్రి అనిల్ దివ్యబలిపూజ, 7గంటలకు ముట్లూరు విచారణ గురువులు గురుశ్రీ మార్నేని దిలీప్‌చే దివ్యబలిపూజ, 8గంటలకు దాచేపల్లి విచారణ గురువులు గురుశ్రీ ఏరువ బాలశౌరెడ్డిచే దివ్య బలిపూజ, ఉదయం 10.30 గంటలకు గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగయ్యచే సమిష్టి దివ్య పూజ, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గురవరేణ్యులు గురుశ్రీ పామిశెట్టి తోమస్ బృందంచే గానం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం, 3గంటలకు కోలాటం, సాయంత్రం 6గంటలకు సాగర్‌మాత రథోత్సవం నిర్వహించారు.

పురవీధుల్లో రథోత్సవం

సాయంత్రం పురవీధుల్లో సాగర్‌మాత రథోత్సవాన్ని నిర్వహించారు. సాగర్‌మాత దేవాలయం, అంబేద్కర్ సెంటర్, పార్క్ సెంటర్ వద్ద పాము, చెట్టు రూపాల్లో తయారు చేసి కాల్చిన బాణా సంచా పలువురిని ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ఫాదర్స్ జోసఫ్‌బాలసాగర్, ఫాదర్ తంబి, మనోజ్‌కుమార్, ఆలయ పెద్దలు జోషి, జెక్కిరెడ్డి చిన్నపరెడి, ఇన్నారెడ్డి, శౌర్రాజు, మరియదాసు, శౌరిబాబు, బాలస్వామి పాల్గొన్నారు.


సాగర్‌మాత దేవాలయంలో నిర్వహించిన దివ్యబలిపూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

దైవ దర్శనానికి వెళ్తూ అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతి


ఏపీ లింగోటం వద్ద జరిగిన ప్రమాదంలో ధ్వంసమైన కారు

నార్కట్‌పల్లి: దైవ దర్శనానికి వెళ్తుండగా నల్లగొండ జిల్లాలో జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు స్నేహితులు మృతిచెందారు. నార్కట్‌పల్లి ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా ఓల్డ్ అల్వాలకు చెందిన ఐదుగురు స్నేహితులు ప్రవీణ్, సాయికుమార్ గౌడ్, చిల్లాసాగర్ సాయి సందీప్ గౌడ్, హరీష్, మధుకర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలోని శ్రీకనకదుర్గ అమ్మవారి దైవ దర్శనం కోసం ప్రవీణ్ కారులో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత1:30గంటల సమయంలో బయలుదేరారు. ఆదివారం తెల్లవారు జామున 5:30గంటల సమయంలో మార్గమధ్యంలోని నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామ శివారులో గల హైదరాబాద్– విజయవాడ జాతీయ ప్రధార రహదారి వద్ద రోడ్డు పై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. కారులో ప్రయాణిస్తున్న కుంచ సాయికుమార్ గౌడ్(32), సాయిసందీప్ గౌడ్ (23) అక్కడికక్కడే మృతి చెందారు. హరీష్, మధుకర్‌లకు గాయాలయ్యాయి. డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న నార్కట్‌పల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని హాస్పిటల్‌కు తరలించారు. మృత దేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. తెల్లవారు జామున పొగ మంచు కమ్ముకోవడంతోపాటు, నిలిచి ఉన్న లారీకి వెనుక భాగంలో రెడ్ స్టిక్కర్ కూడా లేకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు భావిస్తున్నారు.


సాయికుమార్ గౌడ్ (ఫైల్)


చిల్లాసాగర్ సాయి సందీప్ గౌడ్ (ఫైల్)

రాజీవ్‌గాంధీ పాలనలో సాంకేతిక విప్లవం

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


రాజీవ్‌గాంధీ విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట : మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ పాలనలోనే దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలకడం జరిగిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. రామన్నపేటలో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. రాజీవ్‌గాంధీ సాహసోపేతమైన నిర్ణయం వల్ల యువత విదేశాల్లోనూ ఉపాధి అవకాశాలు లభించాయని వివరించారు. రాజీవ్ గాంధీ ఆశయసాధనకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, విగ్రహదాత వనం హర్షినీచంద్రశేఖర్ పట్టణకాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జమీరొద్దిన్ నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, గాదె శోభారాణి, గంగుల క్రిష్టారెడ్డి, రవిచంద్ర, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి సినీ గాయకురాలు గీతామాధురి ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. హైదరాబాద్‌కు చెందిన అను శ్రీ ఈవెంట్స్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా పలువురు కళాకారులు భక్తి గీతాలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. కేరళ సంప్రదాయ వాయిద్య కళాకారుల ప్రదర్శన అలరించింది.


భక్తి గీతాలు ఆలపిస్తున్న గీతామాధురి


సంప్రదాయ నృత్యం చేస్తున్న కళాకారులు


కేరళ కళాకారుల వాయిద్య ప్రదర్శన

తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్‌వి జోకర్ చేష్టలు

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి


మాట్లాడుతున్న కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు: తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ జోకర్ చేష్టలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఘాటైన విమర్శలు చేశారు. ఆదివారం మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలోని తన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్ల బిక్కేరుకు వస్తుండగా ఎమ్మెల్యే సామేల్ పూజలు చేసి తానే తెచ్చానని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో మూసీ, బిక్కేరుల నుంచి దోసెడు ఇసుక తియ్యనివ్వనని హామీ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిచాక.. నేడు వంగమర్తి నుండి వందలాది లారీల్లో ఇసుక తరలింపు జరుగుతున్నా ఎమ్మెల్యే స్పందించడం లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో మంజూరు చేయించిన మున్సిపల్ పక్కా భవనం నిర్మాణాన్ని పూర్తి చేయించే శక్తి సామేల్‌కు లేదన్నారు. కేసీఆర్ కల్పించిన రిజర్వేషన్ల వల్లనే ప్రస్తుత వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నూనె ముంతల విమలవెంకటేశ్వర్లు చైర్మన్ అయ్యారన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. రాజకీయ భిక్ష పెట్టిన కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, జగదీష్‌రెడ్డిలను ఎమ్మెల్యే సామేల్ తిడితే సహించేది లేదని హెచ్చరించారు. సింగిల్‌విండో చైర్మన్‌గా తాను, తన కుమారుడు అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు చేసి, నేటికీ ఆ అవినీతి ఏంటో ఎమ్మెల్యే సామేల్ నిరూపించలేక పోయారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా అబద్దాలు చెబుతూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాల అధ్యక్షులు పొన్నబోయిన రమేష్, కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీను, ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేషం, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు కొణతం యాకూబ్ రెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, నాయకులు దాసరి తిరుమలేష్, రాంపాక నాగయ్య, సామ పద్మారెడ్డి, కొండా సోంమల్లు, కోక భిక్షం, అన్నందాసు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

తెప్పల నీడలో ప్రయాణం..

అర్వపల్లి: ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి ప్రాంతానికి చెందిన మత్స్య కార్మికులు ప్రతివేసవిలో తిరుమలగిరి ప్రాంతంలో చేపలు పట్టేందుకు వస్తారు. ఆదివారం అర్వపల్లి శివారులోని హైవే వెంట ఆగి రోడ్డు పక్కన చెట్ల కింద సేద తీరారు. అయితే ఎండలు మండిపోతుండటంతో చేపలు పట్టడానికి చెరువుల్లోకి వెళ్లడానికి ఉపయోగించే తెప్పల కింద సేద తీరుతూ ప్రయాణం సాగిస్తున్నారు. ప్రతి వేసవిలో తాము ఏపీ నుంచి ఈ ప్రాంతానికి వచ్చి చేపలు పడతామని మత్స్యకారులు పేర్కొంటున్నారు.



